క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల చేయూత



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సంగనమోని శ్రీనివాసులు కుటుంబానికి 1993–94 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల మిత్ర బృందం శుక్రవారం రూ.36 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అన్ని వేళల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వాకిటి శ్రీహరి గెలుపునకు ప్రార్థనలు



అమరచింత: మక్తల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అఖండ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలవాలంటూ శుక్రవారం పట్టణంలోని రాజావళీ, మహబూబ్ ఉస్సేనీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈమేరకు జామీయ మసీద్ కమిటీ అధ్యక్షుడు, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న రాష్ట్రం బీఆర్‌ఎస్ పార్టీ కబంధ హస్తాల మధ్య అప్పుల తెలంగాణగా మారిందన్నారు. ప్రజలు కోరుకున్న తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందన్నారు. మసీదులో ప్రత్యేక నమాజు అనంతరం ముస్లిం మైనార్టీలతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కొబ్బరికాయలను కొట్టి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో తౌఫిక్, అను, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించండి

కోడేరు: వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు. వరి కోతలు కోసి దాదాపు 20 రోజులు కావొస్తున్నా అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. అకాల వర్షాలు వస్తే వరిధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మండలంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హైమాస్ట్.. వేస్ట్



అమరచింత: మండలంలోని కిష్టంపల్లి ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగకపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదు. ఇందిరమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కొన్ని నెలలుగా ఒరిగిపోతూ కిందపడుతున్న వాటిని తొలగించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద చౌరస్తాలో నిత్యం రాత్రి వేళలో వెలుతురు ఉండాలని ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను పునరుద్ధరించాలని జూరాల ప్రాజెక్టుకు వెళ్తున్న ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

భానుప్రకాశ్‌కు డాక్టరేట్



వనపర్తి టౌన్: మదనాపురం మండలంలోని దుప్పల్లికి చెందిన అంబటి భానుప్రకాశ్‌కు డాక్టరేట్ రావడంపై సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ ప్రాచ్య భాషల విభాగం (తెలుగు)లో డా. చవ్వ వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో 'వనపర్తి జిల్లా సాహిత్యం ఒక పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేశారని, ఇందుకు గాను గత నెల 24వ తేదీన భానుప్రకాశ్‌కు డాక్టరేట్ అందిస్తున్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లాకు సంబంధించిన పలు సాహిత్య అంశాలపైన పరిశోధన చేసి నూతన అంశాలను వెలువరించారని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కోట్ల వెంకటేశ్వరరెడ్డి, కందూరు నారాయణరెడ్డి, డాక్టర్ కె.వీరయ్య, బైరోజు చంద్రశేఖర్, డా.తూర్పంటి నరేష్‌కుమార్, డా.శ్యాం సుందర్, బండారు శ్రీనివాస్, ఉప్పరి తిరుమలేష్ పాల్గొన్నారు.

మైసమ్మకు పూజలు

పెద్దకొత్తపల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి మాండవగిరి స్వామి యాదవ్ శుక్రవారం నాయినోనిపల్లి మైసమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లాపూర్ మండలంలోని చుక్కాయిపల్లి గ్రామానికి చెందిన మాండవగిరి స్వామి యాదవ్ హైదరాబాద్‌లో స్థిరపడి 2021లో ఎంఐఎం అర్బన్ డివిజన్‌లో కార్పొరేటర్‌గా గెలుపొందారు. ఎమ్మెల్యేగా గెలుపొందాలని అమ్మవారిని మొక్కులు తీర్చుకున్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- రూ.పది లక్షలతో నిర్మించిన గోపల్‌దిన్నె రిజర్వాయర్ గెస్ట్‌హౌస్
- అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం
- వినియోగంలోకి తేవాలని విన్నవించినా స్పందించని అధికారులు



శిథిలావస్థకు చేరుతున్న గోపల్‌దిన్నె రిజర్వాయర్ అతిథి గృహం

వీపనగండ్ల: రైతుల ప్రయోజనం కోసం రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన గోపల్‌దిన్నె రిజర్వాయర్ గెస్ట్ హౌస్ శిథిలావస్థకు చేరుకుని అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రైతులు, జూరాల కాల్వల నీటి నిర్వహణలో పనిచేసే ఉద్యోగులకు ఉపయోగపడేలా నిర్మించిన ఈ విశ్రాంతి గదులు పోకిరీలు మద్యం తాగేందుకు నిలయంగా మారినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని మండలంలోని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

2007లో నిర్మాణం

గోపల్‌దిన్నె రిజర్వాయర్ వద్ద ఉపయోగకరంగా ఉంటుందన్న సదుద్దేశంతో ఏప్రిల్ 2007 సంవత్సరంలో దాదాపు రూ.10 లక్షలు ఖర్చు చేసి రిజర్వాయర్ గెస్ట్ హౌస్‌ను నిర్మించారు. ఆనాటి ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు గెస్ట్ హౌస్‌ను ఆర్భాటంగా ప్రారంభించారు. గదుల నిర్మాణంతో పాటు అవసరమైన ఫర్నీచర్‌ను కూడా అధికారులు సమకూర్చారు.

ఉద్యోగులు, రైతులకు ప్రయోజనం

గోపల్‌దిన్నె రిజర్వాయర్ ద్వారా చిన్నంబావి, పెంట్లవెల్లి, వీపనగండ్ల మండలంలోని దాదాపు 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. నీటి నిర్వహణ కోసం ఔట్‌ఫాల్ గేట్లను కూడా ఈ గెస్ట్ హౌస్ సమీపంలోనే నిర్మించారు. కాల్వల వెంట తిరిగే లస్కర్లకు ప్రయోజనం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో వీటి నిర్మాణం చేపట్టారు. గెస్ట్ హౌస్ వినియోగాన్ని గాలికి వదిలేయడంతో రాత్రింబవల్లు సమీప గ్రామాల్లోని అల్లరి మూకలు మద్యం తాగుతూ సేదతీరుతున్నారు. దీంతో పాటు గదులకు బిగించిన తలుపులు , కిటికీలను ధ్వంసం చేస్తున్నారు. వీరి ఆగడాలతో పంట పొలాలకు వెళ్లే మహిళా రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

పలుమార్లు విన్నవించాం



గెస్ట్‌హౌస్‌ను వినియోగంలోకి తేవాలని, పాడైన కాల్వలకు మరమ్మతు చేపట్టాలని ఉన్నతాధికారులకు ఎన్నో మార్లు విన్నవించాం. నిధుల కొరత వల్ల నిర్మించలేకపోతున్నామని సమాధానం ఇవ్వడమే తప్పా పనులు మాత్రం చేయడం లేదు.

– ఇస్మాయిల్, రైతు, గోవర్ధనగిరి

ఇలాంటి దుస్థితి వస్తుందనుకోలే..



రిజర్వాయర్ గెస్ట్‌హౌస్ ప్రారంభ సమయంలో సర్పంచ్‌గా ఉన్న నేను ఈ గదులకు ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. రైతులు, ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉండాల్సిన విశ్రాంతి గదులు శిథిలావస్థకు చేరడం, అసాంఘీక కార్యకలాపాలు కొనసాగడం చూస్తే బాధేస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసులు, మాజీ సర్పంచ్, గోపల్‌దిన్నె

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

విశ్రాంతి గదుల వినియోగం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం. క్షేత్రస్థాయి పరిశీలన జరిపి రైతుల అభిప్రాయాలను కూడా తెలుసుకుంటాం. విశ్రాంతి గదులు వినియోగంలోకి వస్తే పలువురికి ప్రయోజనకరంగా ఉంటుంది.

– ప్రభు, ఏఈ, జూరాల ప్రాజెక్ట్, పెబ్బేరు

ఆగుతూ.. సాగుతూ..

- బిల్లులు అందక నిలిచిన నిర్మాణ పనులు
- నత్తనడకన వైకుంఠధామాలు



అమరచింతలో నిలిచిన వైకుంఠధామ నిర్మాణ పనులు

అమరచింత: కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో అధునాతనమైన పద్ధతిలో నూతన వైకుంఠధామాలు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో వైకుంఠధామం నిర్మాణం కోసం రూ.కోటి విడుదల చేసింది. వీటి కోసం టెండర్ ప్రక్రియ చేపట్టి పనులను అప్పగించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించినా.. సరైన సమయానికి బిల్లులు అందకపోవడంతో నిర్మాణ పనులను నిలిపివేశారు. దీంతో ఆయా మున్సిపాలిటీల్లో నిర్మాణ పనులు 65 నుంచి 70 శాతం వరకు పూర్తవగా మిగిలిన పనులు అటకెక్కాయి. జిల్లాలో కొత్తగా ఏర్పాటు జరిగిన అమరచింత, ఆత్మకూర్, కొత్తకోట, పెబ్బేర్ మున్సిపాలిటీల్లో వైకుంఠధామ నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ బడ్జెట్ ద్వారా నిధులు సమకూర్చుతుండటంతో పనులను చేపడుతున్న కాంట్రాక్టర్లకు సకాలంలో డబ్బులు అందకపోవడమే ఇందుకు ప్రధాన కారణం అని పలువురు వెల్లడించారు. పెద్ద పట్టణాల్లో స్థల ప్రభావం ఉండటంతో భవిష్యత్తులో మృతదేహాల ఖననం కోసం స్థలాలు ఉండవని భావించి నూతన టెక్నాలజీతో భావితతరాలకు ఉపయోగపడే విధంగా వైకుంఠధామాలను నిర్మించేందుకు సిద్ధమైన ప్రభుత్వం వీటి నిర్మాణాలకు త్వరితంగా డబ్బులను చెల్లించాలని కోరుతున్నారు.

సౌకర్యాలు ఇలా..

కొత్తగా నిర్మించే వైకుంఠధామాల్లో మృతదేహాల దహనం కోసం వచ్చిన వారికి సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికతో నిర్మణ పనులు చేస్తున్నారు. వీటిలో వెయిటింగ్ గదులు, సెక్యూరిటీ గది, ఆస్ రూం తో పాటు సీటింగ్ గ్యాలరీ ఏర్పాటు చేస్తారు. రెండు బర్నింగ్ ప్లాంట్లు, పూజా మండపం, టాయిలెట్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలి. అంతే కాకుండా ఆహ్లాదం కోసం వైకుంఠధామం మధ్యలో పార్కును ఏర్పాటు చేస్తారు. వీటి చుట్టు ప్రహరీ లేదా పెన్సింగ్‌ను కల్పించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ప్రభుత్వం సంకల్పించింది.

శిథిలావస్థలో పాఠశాల భవనం



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో దాదాపు 15 ఏళ్ల కిందట నిర్మించి పాఠశాల భవనం నిర్మించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రభుత్వ సొమ్ము వృథా అయ్యింది. అప్పట్లో రూ.7.50 లక్షలు వెచ్చించి భవనం నిర్మించారు. కాని భవనం నిర్మించినా ప్రారంభించకపోవడంతో ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రభుత్వ నిధులు వృథా కావడంతో స్థానికులు సంబంధిత అధికారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వీపనగండ్లలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వీపనగండ్ల: విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే ను పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదయిన గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ టీచర్లు తగు సూచనలు ఇచ్చారు. వారి ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ తదితర అంశాలపైన సూచనలు చేశారు. పౌష్టికాహారం వినియోగంపై ఉన్న అపోహలను వీడాలని, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల పలు ప్రయోజనాలు కలుగుతాయని అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, మహేశ్వరీ, సువర్ణ, కమల, ఎల్లమ్మ, పారిజాత, చంద్రకళ, మాధవి, కృష్ణమ్మ, భారతి తదితరులు అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోండి



మానవపాడు: మిర్చి రైతు కష్టాలు వర్ణణీతం. మిరప రైతులకు సకాలంలో వర్షాలు లేక ఏడాది ప్రారంభం నుంచి కష్టాలు ఎదురవుతున్నాయి. పంట పొలాల్లో తెగుళ్ల సోకి మిర్చి పంటను తొలగించారు. కష్టానష్టాలతో పండించిన మిర్చి పంటల్లో తెగుళ్ల బెడద వెంటాడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.45 వేల దాకా కౌలుకు తీసుకొని పంటకు ఎకరాకు దాదాపు రూ.1.80లక్షల నుంచి రూ.2.20 లక్షలు పెట్టుబడులు పెడుతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడులు వస్తాయో.. రావోని రైతులు దిగాలు చెందుతున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు శివారులోని కూడలి పక్కన ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు. మండల కేంద్రానికి చెందిన ఉప్పలపాడు నారాయణ రెడ్డి దాత సహకారంతో రూ.25 లక్షల ఖర్చుతో ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, శరణయ్య పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం అందజేత

అయిజ: మండలంలోని బింగుదొడ్డిలో గురువారం తెల్లవారుజామున గొల్ల నరసింహులు ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోవడంతో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకుడు రాముడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారికి రూ.10,000 ఆర్థిక సాయం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని అన్నారు.

పెరిగిన ఓటింగ్ శాతం



కొల్లాపూర్‌లో అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లతో మాట్లాడుతున్న ఆర్‌ఓ కుమార్ దీపక్

కొల్లాపూర్: నియోజకవర్గంలో 81.42 శాతం ఓటింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్ వెల్లడించారు. నియోజకవర్గంలోని 7 మండలాల్లో మొత్తం 2,34,167 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,90,669 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుష ఓటర్లు 1,19,263 మంది ఉండగా, 98,114 మంది ఓటు వేశారు. మహిళా ఓటర్లు 1,14,900 మందికి 92,553 మంది మహిళలు ఓటు వేశారు. థర్డ్ జెండర్ ఓట్లు 4 ఉండగా వీరిలో ఇద్దరు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2018 ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం 82.72 గా నమోదైంది. మొత్తం 2,08,941 ఓట్లు ఉండగా, 1,72,846 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో కంటే ఈసారి 17,823 మంది ఎక్కువగా ఓట్లు వేశారు.

అత్యధికం, అత్యల్పం..

నియోజకవర్గంలో మొత్తం 269 పోలింగ్ బూతులు ఉండగా, వీటిలో మెజారిటీ కేంద్రాల్లో 80 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. చిన్నంబావి మండలం పెద్దదగడలో 172 పోలింగ్ బూతులో అత్యధికంగా 96.73 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ బూతులో 765 ఓట్లకు గాను 740 ఓట్లు పోల్ అయ్యాయి. అదే విధంగా చెల్లెపాడులోని 176 బూతులో 91.15 శాతం, కొప్పునూరు గ్రామంలోని 180 బూతులో 90.27శాతం, దగడపల్లిలోని 168 బూతులో 90.36 శాతం, వీపనగండ్ల మండలం సంపత్రావుపల్లి గ్రామంలోని 151 బూతులో 90.25 శాతం, రంగవరం గ్రామంలోని 150 బూతులో 91.86 శాతం, పాన్‌గల్ మండలంలోని బండపల్లి గ్రామంలో గల 131 బూతులో 90.27 శాతం, పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రబండ తండాలో 46వ బూతులో 91.79శాతం, కొల్లాపూర్ మండలంలోని తెల్లపలుగు తండాలో 91.86 శాతం, పెంట్లవెల్లి మండలంలోని కొండూరులో గల 197 బూతులో 90.12 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యల్పంగా కొల్లాపూర్ పట్టణంలోని 250 వబూతులో 52.30 శాతం, పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలు గ్రామంలోని 51 వ బూతులో 69.62 శాతం, పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని 16 బూతులో 67.41 శాతం, వెన్నచెర్ల గ్రామంలోని 1 వ బూతులో 67.24, చంద్రకల్ గ్రామంలోని 6 వబూతులో 69.45 శాతం పోలింగ్ నమోదైంది.

కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన

నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌పై శుక్రవారం జిల్లా కేంద్రంలో అగ్రికల్చర్ మార్కెట్‌యార్డులో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు సమావేశానికి హాజరయ్యారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే వారు పాటించాల్సిన నిబంధనలు, ఇత అంశాలను రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్ వారికి వివరించారు.

77 శాతం పోలింగ్ నమోదు

లింగాల: అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో 77 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారుల వెల్లడించారు. మండలంలో మొత్తం 34 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 30,060 వేల ఓట్లు ఉండగా 23,026 వేల ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని అప్పాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 367 ఓట్లకు గాను 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పెంటలలో 233 మంది చెంచులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2018 ఎన్నికలకు కన్న ఈ సారి పోలింగ్ శాతం పెరిగింది.

కార్తీక వన భోజనం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం కార్తీక వనభోజనం నిర్వహించారు. శివాలయంలో శివుడికి అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. దాతల సహకారంతో వనభోజనం చేశారు.

భవానీ మాత ఉత్సవాలు ప్రారంభం

గట్టు: అంబాభవాని మాత ఉత్సవాలు శుక్రవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ప్రతియేటా కార్తీక మాసంలో అంబాభవాని మాత ఉత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే కార్తీక బహుళ పంచమి శుక్రవారం పందిరి పూజతో భవాని మాత ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఎస్‌ఎస్‌కే (క్షత్రియ సంఘం) సమాజ్ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతరకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. పందిరి పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఆకు పూజ నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదుట మామిడి తోరణాలతో ప్రత్యేకంగా పందిరి వేశారు. ఉదయం 11 గంటలకు అమ్మవారి ఆలయం ఎదుట మామిడి ఆకులు, తోరణాలతో పందిరి వేసి పూజలు చేశారు. జాతర సందర్భంగా ఇప్పటికే సంత బజారులో మిఠాయి దుకాణాలు, చిన్న పిల్లల ఆట వస్తువుల విక్రయ దుకాణాలు వెలిశాయి. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు పెద్ద అంబుసా, సంఘం సభ్యులు పాపురం వెంకటేష్, సూపర్ పటేల్ వీరన్న, వినోద్, చంద్రమోహన్, లక్ష్మణ్, సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ



దంతనూరు క్రాస్ రోడ్డు నుంచి సీసీ రోడ్డు పూర్తి



కరివెన క్రాస్ నుంచి సీసీ రోడ్డు పూర్తి

- సీసీ రోడ్ల నిర్మాణాలతో గ్రామాలకు కొత్తకళ
- గోపన్‌పేటలో రూ.1.27కోట్లు, కరివెనలో రూ.62 లక్షలు
- దంతనూరులో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు పూర్తి

మదనాపురం: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో ఫలితాలు ఇస్తున్నాయి. ఏళ్ల తరబడి అంతర్గత రోడ్ల నిర్మాణం జరగకపోవడంతో రాష్ట్ర ఏర్పాటు అనంతరం రెండోసారి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లోని అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి పెద్దపీట వేసింది. దీంతో గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ప్రధానంగా మదనాపురం మండలంలోని దంతనూరు క్రాస్ రోడ్డు నుంచి ఊరిలోకి రూ.20 లక్షలు, కరివెన క్రాస్ రోడ్డు నుంచి ఊర్లోకి రూ.62 లక్షలు, గోపన్‌పేట క్రాస్ రోడ్ నుంచి ఊర్లోని ఆంజనేయస్వామి గుడి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. గతంలో రోడ్డు అధ్వానంగా ఉండేది. వర్షం వస్తే బురదలో నడుచుకుంటూ వెళ్లేవారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పనులు పూర్తయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మట్టి రోడ్డుపై నడిచే బాధ తప్పిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల వివరాలు

- ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ.69 లక్షలు, ఎస్‌డీఎఫ్ రూ.15 లక్షలు గ్రామ పంచాయతీ నిధులు రూ.28 లక్షలు, సీడీపీ నిధులు రూ.15 లక్షలు కేటాయించి గోపన్‌పేటకు రోడ్డు నిర్మాణం చేపట్టారు.
- ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.10 లక్షలు, సీడీపీ నిధులు రూ.20 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.12 లక్షలు ఖర్చు చేసి కరివెనకు సీసీ రోడ్డు వేశారు.
- ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15లక్షలు, సీడీపీ రూ.5 లక్షలు వినియోగించి దంతనూరుకు సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు.

సంతోషంగా ఉంది..



క్రాస్ రోడ్ నుంచి గ్రామంలోకి 1.5 కిలోమీటరు పొడవున రూ.62 లక్షలతో సీసీ రోడ్డు పూర్తి చేశాం. గతంలో మట్టి రోడ్డు గుండా నడిచేందుకు వర్షాకాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నా హయాంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో సీసీరోడ్డు నిర్మాణం పూర్తి చేశాం.

అనిత, సర్పంచ్, కరివెన

ఎమ్మెల్యే సహకారంతో..



క్రాస్ రోడ్ నుంచి గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వరకు రూ.1.27 కోట్లు వెచ్చించి 2.16కిలో మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రజలు నాకు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్నా. దీనికి ఎమ్మెల్యే పూర్తి సహకారం అందించారు.

– ఆంజనేయులు యాదవ్, సర్పంచ్, గోపన్‌పేట

నడవాలంటే ఇబ్బందిగా ఉండేది



దంతనూరు క్రాస్ రోడ్ నుంచి ఊర్లోకి రావాలంటే మట్టి రోడ్డు గుండా నడవాలంటే ఇబ్బందిగా ఉండేది. వర్షాకాలంలో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు ఆగి బురదమయంగా మారేవి. ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా ఉండే. రూ.20 లక్షలతో అర కిలోమీటరు పొడువున సీసీ రోడ్డు వేశాం.

– శ్రావణి, సర్పంచ్, దంతనూరు

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



వీపనగండ్లలో ఎయిడ్స్ నిర్మూలన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వీపనగండ్ల: ఎయిడ్స్ రోగులపై వివక్ష చూపకుండా వారిని ఆదరించాలని వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎయిడ్స్ డే ను పురస్కరించుకుని వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఏయిడ్స్ వ్యాధి అంటు రోగం కాదని, తగు జాగ్రత్తలు ప్రాథమిక స్థాయిలో తీసుకోవడం వల్ల ఎయిడ్స్ నుంచి బయట పడొచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



మదనాపురంలో..

మదనాపురం: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య సిబ్బంది డాక్టర్ జయచంద్రమోహన్, డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాని పురస్కరించుకొని మదనాపురం మండల కేంద్రంలోని బాలుర గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ వ్యాధి రక్తం మార్పిడి వల్ల వ్యాపిస్తుందని, అంటు రోగం కాదన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భవానిరెడ్డి, సూపర్‌వైజర్లు ప్రమీల, భారతమ్మ, హజీ, సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.